

# ఆఖరి పువ్వు

పన్నెండవ ప్రపంచయుద్ధం ఈ భూమ్మీద నాగరికతని పూర్తిగా మట్టుపెట్టిందన్న విషయం అందరికీ తెలిసినదే. ఊళ్లూ, గ్రామాలూ, నగరాలూ అయిపు లేకుండా పోయాయి. చిట్టడవులూ, మహారణ్యాలూ నాశనమయ్యాయి. అందమైన తోటలూ, కళాకృతులూ పూర్తిగా మాయమయ్యాయి.

మగాళ్లూ, ఆడవాళ్లూ, పిల్లలూ జంతువుల కన్నా హీనాతిహీనంగా బతకసాగారు. తమ యజమానుల పరిస్థితి చూసి కుక్కలు కూడా వారిని విడిచిపెట్టిపోయాయి. ఇన్నాళ్ళూ ఈ భూమిని తమ అధీనంలో వుంచుకుని రాజ్యమేలుతూ విర్రవీగిన మనుషుల దుస్థితి చూసి కుందేళ్ళకి సైతం కొమ్ములు మొలిచి వాళ్లని పీడించసాగాయి.

సాహిత్యమూ, సంగీతమూ, చిత్రకళా పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం వల్ల జనం ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నారు. ఏళ్ళకి ఏళ్ళు అలా గడిచిపోయాయి. యుద్ధంలో బతికి బైటపడ్డ సైన్యాధికారులు కూడా తాము యుద్ధం ఎందుకు చేశారో, ఏం నిర్ణయాలు తీసుకున్నారో మర్చిపోయారు. అమ్మాయిలూ, అబ్బాయిలూ యుక్తవయసు వచ్చినా ఊరికే ఒకరివైపొకరు కళ్లప్పగించి చూస్తూ కూర్చునేవారు. ప్రేమ అనేది ఈ భూమ్మీద మిగల్లేదు మరి!

ఎన్నడూ పువ్వుల్ని చూసి వుండని ఒక అమ్మాయి హఠాత్తుగా ఒకరోజు ఈ భూమ్మీది ఆఖరి పువ్వుని చూసింది. ఆ పిల్ల తన స్నేహితులకి ఆ పువ్వు వాడి ఎండిపోతోందని చెప్పింది. ఒకే ఒక కుర్రవాడు తప్ప ఇంకెవరూ ఆమె మాటలు వినిపించుకోలేదు. అప్పుడు ఆ పిల్లా, ఆ కుర్రవాడు కలిసి ఆ పువ్వు పూచిన మొక్కని బతికించడానికి ప్రయత్నించారు. అది బతికింది.

ఒకరోజు ఒక తేనెటీగ వచ్చి ఆ పువ్వుమీద వాలింది. దానివెంటే ఒక హమ్మింగ్ బర్డ్ కూడా వచ్చింది. త్వరలోనే ఒకటికి రెండు పువ్వులయ్యాయి. ఆ తరువాత నాలుగు పువ్వులు

యుద్ధంలో బతికి బైటపడ్డ సైన్యాధికారులు కూడా తాము యుద్ధం ఎందుకు చేశారో, ఏం నిర్ణయాలు తీసుకున్నారో మర్చిపోయారు. అమ్మాయిలూ, అబ్బాయిలూ యుక్త వయసు వచ్చినా ఊరికే ఒకరివైపొకరు కళ్లప్పగించి చూస్తూ కూర్చునేవారు. ప్రేమ అనేది ఈ భూమ్మీద మిగల్లేదు మరి!

పూశాయి. ఇక ఎన్నో పువ్వులు పూయసాగాయి. చిట్టడవులూ, అరణ్యాలూ ఏర్పడ్డాయి.

ఆ పిల్ల అందంగా అలంకరించుకోవడం మీద మక్కువ చూపించసాగింది. ఆ కుర్రవాడికి ఆ పిల్లని ముట్టుకోవాలనిపించింది. ముట్టుకుంటే చాలా బావుందనిపించింది. మళ్ళీ ఈ భూమ్మీద ప్రేమ చిగురించింది. వాళ్లిద్దరికీ కాలక్రమాన పిల్లలు పుట్టారు. ఆ పిల్లలు పుష్టిగా, ఆరోగ్యంగా పెరిగి, నవ్వుతూ ఆడుకోవడం మొదలుపెట్టారు. పారిపోయిన కుక్కలు కూడా మళ్లీ వాళ్ళదగ్గర కొచ్చి చేరాయి.

కుర్రవాడు రాళ్లని ఒకదానిమీదొకటి పేర్చి ఇల్లు కట్టటమెలాగో కనుక్కున్నాడు. అతన్ని చూసి అందరూ ఇళ్లు కట్టుకోసాగారు. ఊళ్లూ, గ్రామాలూ, నగరాలూ మళ్ళీ ఏర్పడ్డాయి.

జనం పాడటం మళ్లీ కొత్తగా నేర్చుకున్నారు. వాద్యగాళ్ళూ, ఇంద్రజాలికులూ, దర్జీలూ, చెప్పులు కుట్టేవాళ్ళూ తమతమ వృత్తులు ప్రారంభించారు. కవులు కవిత్వం చెప్పారు. చిత్రకారులు చిత్రాలు గీశారు. శిల్పులు శిల్పాలు చెక్కారు. చక్రాన్ని మళ్లీ కనిపెట్టారు.

త్వరలోనే సైనికులు తయారయారు. సేనాధిపతులూ, సైన్యాధికారులూ, స్వాతంత్ర్య సమర యోధులూ పుట్టుకొచ్చారు.

కొంతమంది జనం కొండల మీద నివాసం ఏర్పరచుకుంటే కొందరు లోయల్లో నివసించసాగారు. కొద్ది రోజుల్లోనే కొండల మీదున్న వాళ్లకి లోయల్లో వుంటే బావుంటుందనీ, లోయల్లో వాళ్లకి కొండమీదుంటే బావుంటుందనీ అనిపించసాగింది.

స్వాతంత్ర్యయోధులు దేవుడి పేరుతో ఈ అసంతృప్తిలో ఆజ్యం పోశారు. ఇంకేముంది? మళ్లీ యుద్ధం ప్రారంభమైంది. కానీ ఈసారి మునుపటికన్నా చాలా ఎక్కువగా విధ్వంసం జరిగింది. ఈ భూమ్మీద ఏమీ మిగలకుండా సర్వనాశనమైపోయింది.

కానీ ఒక స్త్రీ, ఒక పురుషుడు, ఒక పువ్వు మాత్రం మిగిలాయి!

★

మూలం : అమెరికా కథ

– జేమ్స్ థర్బర్ (1894–1961)

అనువాదం: ఆర్.శాంతసుందరి